సాక్షి
బాపట్ల
ఆదివారం । 18 । జూన్ । 2023



ఫోర్టిఫైడ్ రైస్‌తో చక్కని ఆరోగ్యం

గుంటూరు వెస్ట్: జిల్లా ప్రజలకు వచ్చే నెల మొదటి నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ తెలిపారు. శనివారం పోస్టర్‌ను విడుదల చేశారు.



అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి

పిట్టలవానిపాలెం: చందోలు బగళాముఖి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తిరుపతమ్మ ఆదాయం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.1.40 కోట్లకు పైగా నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు.

న్యూస్‌రీల్

హాస్టళ్లలో వసతులు మెరుగుపరచండి

నరసరావుపేట ఈస్ట్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. రైల్వేస్టేషన్ సమీపంలోని బాలికల వసతిగృహాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి సందర్శించారు. వసతిగృహంలోని వసతులపై ఆరా తీశారు. పాఠశాలలు పునఃప్రారంభమైన దృష్ట్యా వసతిగృహాలను అధికారులు పరిశీలించి తగిన మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. ఈసందర్భంగా వివిధ హాస్టల్స్ వార్డెన్లు కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని కలసి హాస్టళ్లకు కావలసిన మౌలిక వసతులు, మరమ్మతులపై వినతిపత్రం అందచేశారు. దీంతో కలెక్టర్ శివశంకర్ ఆయా శాఖల అధికారులకు ఫోన్ చేసి వెంటనే హాస్టల్స్‌ను సందర్శించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏఎస్‌డబ్ల్యూఓ సంతోష్ కుమార్, వార్డెన్లు పాల్గొన్నారు.

నేడు ఎంఈఓ-2 పోస్టులకు కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాకు కొత్తగా మంజూరు చేసిన 58 రెండవ ఎంఈఓ పోస్టులను భర్తీ చేసేందుకు ఆదివారం ఉదయం 9 గంటలకు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీ యాజమాన్యం నుంచి ప్రస్తుతం పని చేస్తున్న ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. సీనియార్టీ జాబితాను www.deoblogspot.com వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

20 నుంచి వైద్య సిబ్బందికి ..

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల (ఆర్డీ) కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులకు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు జనరల్ ట్రాన్స్‌ఫర్ కౌన్సెలింగ్ జరుగుతోందని ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ తెలిపారు. తొలుత 19 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని సర్క్యులర్ ఇచ్చినప్పటికీ ఆరోజు స్పందన కార్యక్రమం ఉండటం వల్ల 20 నుంచి 22వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 579 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు ఆఫీస్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, పీఎంఓఓ, రేడియోగ్రాఫర్లకు కౌన్సెలింగ్ జరుగుతోందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పీఎస్ఓ, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసీ సూపర్‌వైజర్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంపీహెచ్ఎస్ (ఫీమేల్స్) కు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 21వ తేదీ ఉదయం ఫార్మాశిస్టులు గ్రేడ్-2, హెడ్‌నర్సులు, మధ్యాహ్నం స్టాఫ్‌నర్సులకు.. 22వ తేదీ ఉదయం హెల్త్ ఎడ్యుకేటర్, ఎంపీహెచ్ఓ, పీహెచ్ఎన్‌లకు, మధ్యాహ్నం ఎంపీహెచ్ఎస్(మేల్)కు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

24న ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈనెల 24వ తేదీన జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి తెలిపారు. ఇప్పటి వరకు ఆర్ట్స్ కళాశాలలో పలు కోర్సులు చదివి దేశ విదేశాలలో పలు రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొంటున్నారన్నారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, యూనివర్సిటీ ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1800, గరిష్ట ధర రూ.3300, మోడల్ ధర రూ.2400 వరకు పలికింది.

ప్రతిభకు పట్టం

విద్యే భవిష్యత్తుకు పెట్టు'బడి' అని నమ్మిన సీఎం వైఎస్ జగన్

- విద్యారంగంలో సమూల మార్పులు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- విద్యార్థులకు ఆణిముత్యాలు ప్రతిభా పురస్కారాల పంపిణీ



పురస్కారం పొందిన విద్యార్థులతో మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే కరణం బలరాం, ఎమ్మెల్సీ పోతుల సునీత, కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు

బాపట్ల అర్బన్: దేశ చరిత్రలో ఎవ్వరూ చేయలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారని, విద్యే భావితరాల భవిష్యత్తుకు పెట్టుబడి అని సీఎం వైఎస్ జగన్ నమ్మారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శనివారం వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో బాపట్ల జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా ప్రాధాన్యత గుర్తించి పేదరికం వల్ల పిల్లల చదువులకు దూరం కాకూడదని విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు.

రాష్ట్రంలో పాఠశాలలను మూడు దశల్లో నాడు–నేడు కార్యక్రమం కింద వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో పేద పిల్లల చదువు కోసం అమ్మఒడి, వసతి దీవెన, విదేశీ విద్య తదితర కార్యక్రమాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అవార్డులు, నగదు పురస్కారాన్ని ఇచ్చి ప్రోత్సాహించడానికి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని అభివృద్ధి చేయడానికి అధిక నిధులు వెచ్చిస్తుందన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, మంచి లక్ష్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉంటుందని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 24 మంది విద్యార్థులు, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 14 మంది విద్యార్థులకు రూ.14.55 లక్షల చెక్కులను మంత్రి, జిల్లా కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. ఎమ్మెల్సీ పోతుల సునీత, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి, రాష్ట్ర మార్కెటింగ్, సహకార ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్ర, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



జగన్ మామయ్య జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా నాకు ఈరోజు రూ. 50 వేలు బహుమతిగా ఇవ్వడం ఆనందంగా ఉంది. పదో తరగతి ఫలితాల్లో 593 మార్కులతో జిల్లా ఫస్ట్ రావడం ఎంతో సంతోషంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలన్నది నా లక్ష్యం.

– పోలిశెట్టి సుప్రజ, విద్యార్థిని

ఏరోనాటికల్ ఇంజినీరింగ్ లక్ష్యం

పదో తరగతి పరీక్షల్లో 591 మార్కులు రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో నాకు సన్మానం చేయడం జీవితంలో మర్చిపోలేను. కష్టపడి చదివి ఏరోనాటికల్ ఇంజినీర్ అవడమే నా లక్ష్యం.

– దంతం విష్ణు ప్రియ

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం..



మా పిల్లలను చదివించాలని ఆశ ఉన్నా ఆర్థిక స్తోమత వల్ల గతంలో చదివించలేక పోయేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు – నేడు, జగనన్న గోరుముద్ద పథకాల ద్వారా మాకు అభయం ఇచ్చారు. ఇప్పుడు మా పిల్లలను మేం కాదు ప్రభుత్వమే చదివిస్తోంది. పిల్లల భవిష్యత్తుకు ఎలాంటి దిగులు లేదు. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.

– ప్రసన్న కుమారి, విద్యార్థిని తల్లి, రేపల్లె

స్ఫూర్తిగా నిలుస్తాయి..



ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రామీణ పిల్లల్లో ప్రతిభావంతులను గుర్తించి వారికి జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలను అందజేయడం ద్వారా పిల్లల్లో చదవాలని మరింత పట్టుదలను తీసుకొచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఇలాంటి పురస్కారాలు మరెంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచి, పట్టుదలను పెంచుతాయి.

– గుమ్మ శ్రీనివాసరావు, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, చందలూరు

జిల్లాలో కేంద్రబృందం పర్యటన



కేంద్ర బృందానికి ఉపాధి పనులు గురించి వివరిస్తున్న డ్వామా పీడీ శంకర్‌నాయక్

బాపట్లటౌన్: జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకంలో జరుగుతున్న పనులకు సంబంధించిన ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించేందుకు శనివారం కేంద్రబృందం బాపట్ల జిల్లాలో పర్యటించారు. శుక్రవారం రాష్ట్రానికి చేరుకున్న కేంద్ర బృందం సభ్యులు తాడేపల్లిలోని కమిషన్ కార్యాలయంలోని అధికారులతో సమావేశమై శనివారం బాపట్ల జిల్లాకు చేరుకున్నారు. జిల్లా కార్యాలయంలో ఎన్ఐసీ (నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్) సాఫ్ట్‌వేర్ అమలు విధానంపై పీడీతో చర్చించారు. అనంతరం చీరాలలోని ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయానికి చేరుకొని క్షేత్రస్థాయిలో సాఫ్ట్‌వేర్ పనితీరు, కూలీల మస్టర్‌రోల్‌ను ఆన్ లైన్ చేసే సమయంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే విషయాలపై క్షేత్రస్థాయిలోని సిబ్బందితో చర్చించారు. డ్వామా పీడీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఉపాధిహామి పథకంలో పనులు చేసిన కూలీలకు కొన్ని సందర్భాల్లో వేతనాలు జమఅయినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తుందని, వారి అకౌంట్‌లో నగదు జమకావడం లేదని, వివాహం చేసుకొని తల్లిదండ్రుల నుంచి విడిపోయిన నవ దంపతులకు జాబ్‌కార్డు మంజూరు చేసే సమయంలో కొన్ని టెక్నికల్ సమస్యలు ఎదురవుతున్నాయంటూ వివరించారు. దీనిపై స్పందించిన కేంద్రబృందం సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో జరుగుతున్న పనులు, ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న విధానంపై కేంద్రబృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పర్యటించిన కేంద్రబృందం సభ్యుల్లో కష్యాప్ ముఖేష్‌కుమార్, సౌరభ్‌మిత్ర, అమిత్‌కుమార్, ఉడైవీర్ సింగ్ సత్యవాన్ గుసైన్‌లు ఉన్నారు.

శవరాజకీయాలు టీడీపీకి అలవాటే

- కులాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించటం టీడీపీ ఎమ్మెల్యే సత్య ప్రసాద్‌కు తగదు
- బాధిత కుటుంబానికి అండగా రూ.10లక్షల చెక్కు పంపిన ముఖ్యమంత్రి జగన్
- 24 గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి పంపిన చెక్కును చూపుతున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: శవ రాజకీయాలు చేయటం టీడీపీ అధినేత చంద్రబాబుకు, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు వెన్నతో పెట్టిన విద్య అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు త్రీవస్థాయిలో విమర్శించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెం గ్రామంలో జరిగిన ఘటనను రాజకీయ లబ్ధికోసం శాసనసభ్యుడు అనగాని సత్యప్రసాద్ కులాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించటం హేయమైన చర్యన్నారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా నివ్వటంతో పాటు వ్యక్తిగతంగా రూ. లక్ష ఆర్థికసాయం అందించామన్నారు. మృతుడి సోదరికి అర్హతను బట్టి అంగన్‌వాడీ, ఆయా పోస్టును ఇప్పిస్తామని హామీనిచ్చామన్నారు. అయితే నివేశన స్థలం మంజూరు చేసి గృహం నిర్మించి ఇవ్వాలని మృతుని కుటుంబం అడగ్గానే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కుటుంబానికి ధైర్యం చెప్పి బాధితులను కఠినంగా శిక్షిస్తామని భరోసానివ్వటంతో కుటుంబం సానుకూలంగా ఉందన్నారు. అయితే తాము పరామర్శించి అక్కడి నుంచి వచ్చిన అనంతరం స్థానిక శాసనసభ్యుడు సత్యప్రసాద్ సామాజిక వర్గాల పేరుతో శవరాజకీయాలకు తెరలేపటం బాధాకరమన్నారు. ఆ కుటుంబానికి బాసటగా అందించిన రూ.లక్షను శాసనసభ్యుడు రోడ్డుపై విసిరిపడవేయటం ఆయన నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ఆ కుటుంబానికి అండగా నిలబడటంతో పాటు ఘటనకు పాల్పడిన నలుగిరిలో ముగ్గురు నిందితులను గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలియజేశారు. అయితే రాజకీయ లబ్ధికోసం, తన ఉనికిని కాపాడుకునేందుకు శాసనసభ్యుడు సత్యప్రసాద్ గంటకుపైగా మృతదేహంతో చెరుకుపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేసి ట్రాఫిక్‌కు అవరోధం కల్పించటం హేయమైన చర్యన్నారు. రాస్తారోకో చేయటానికి గల కారణమేమిటో సత్యప్రసాద్ తెలియజెప్పాలన్నారు.

రూ.10లక్షల చెక్కు పంపి మానవత్వం చాటుకున్న సీఎం జగన్..

ఘటన వివరాలను మృతుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వివరించగా మానవత్వం ఉన్న వ్యక్తిగా స్పందించి రూ.10లక్షలు కేటాయించటమే కాకుండా అధికారులతో చెక్కును పంపించారని తెలియజేశారు. దీంతో పాటు ఆ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసాని కల్పించారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందించటంతో పాటు కుల మతాలకు అతీతంగా ఉన్నత పదవుల నుకట్టపెడుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విషం కక్కే ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించారు. నగరం జడ్పీటీసీ మాన్యం నాగలక్ష్మి, పార్టీనాయకులు బొర్రా శ్రీనివాసరావు, యార్లగడ్డ మదన్‌మోహన్, చెన్ను కోటేశ్వరరావు, దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి హత్య కేసులో నిందితుల అరెస్ట్

- అమర్‌నాథ్ సోదరిని ప్రేమ పేరుతో వేధిస్తున్న వెంకటేశ్వరరెడ్డి
- ఆ విషయమై ప్రశ్నించటంతో కక్ష పెంచుకుని, పథకం ప్రకారం హత్య
- ఇందులో రాజకీయ కోణం లేదు
- హత్యలో నలుగురి ప్రమేయం
- ముగ్గురు అరెస్ట్, ఒకరి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

చెరుకుపల్లి: విద్యార్థి అమర్‌నాథ్ హత్య కేసులో ప్రమేయం ఉన్న నలుగురిపై కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. మండల కేంద్రమైన చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రాజవోలు గ్రామంలో శుక్రవారం ఉదయం ట్యూషన్‌కు వెళుతున్న ఉప్పాల గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఉప్పాల అమర్‌నాథ్‌ను ఒక పథకం ప్రకారం రాజవోలు గ్రామానికి చెందిన పాము వెంకటేశ్వరరెడ్డి (వెంకి) తన స్నేహితులు పాము గోపిరెడ్డి, తుమ్మా సాంబిరెడ్డిలతో పాటు అరుంబాక గ్రామానికి చెందిన మద్దెల వీరబాబులతో కలిసి పెట్రోలు పోసి నిప్పంటించి పరారయ్యారన్నారు. మంటల ధాటికి తట్టుకోలేక అమర్‌నాథ్ కేకలు పెట్టగా సమీపంలో ఉన్న వలంటీర్ దొంతుబోయిన రామ్మూర్తిరెడ్డి, పలువురు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వెంటనే అమర్‌నాథ్ బంధువులకు సమాచారం అందించారన్నారు. తీవ్ర గాయాలైన అమర్‌నాథ్‌ను వెంటనే చెరుకుపల్లిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అమర్‌నాథ్ సోదరిని ప్రేమ పేరుతో వెంకటేశ్వరరెడ్డి వేధింపులకు గురిచేస్తుండటంతో ఇదేమని ప్రశ్నించటం జరిగిందని, దీంతో అమర్‌నాథ్ కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు తెలపటం, వెంకటేశ్వరరెడ్డిని అతని కుటుంబ సభ్యులు మందలించటంతో అమర్‌నాథ్‌పై కోపం పెంచుకున్నాడని, దీంతో అమర్‌నాథ్‌ను హత్య చేసేందుకు పథకం వేశాడన్నారు.

రాజకీయాలకు సంబంధం లేదు...

అమర్‌నాథ్ హత్య కేసుకు రాజకీయాలకు ఎటువంటి సంబంధం లేదని ఎస్పీ తెలిపారు. కేవలం విద్యార్థినిని టీజింగ్ చేస్తున్న కారణంగానే వివాదం చోటు చేసుకుందని తెలిపారు. రెండు కుటుంబాలకు రాజకీయాలకు సంబంధం లేదన్నారు. దీనిపై రాజకీయ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారు. సంఘటన జరిగిన గంటల వ్యవధిలో కేసును విచారించి, ప్రధాన నిందితుడితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. మరో ముద్దాయి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. కేసులో నిందితులపై హత్య కేసుతో పాటు పోక్సో కేసు నమోదు చేయటం జరిగిందని తెలిపారు. సమావేశంలో రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, రేపల్లె రూరల్, వేమూరు సీఐలు శివశంకర్, వెంటేశ్వరరావు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: విద్యార్థి అమర్‌నాథ్ మృతి ఘటనపై చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

సముద్రంలో నలుగురు గల్లంతు

సత్వరమే స్పందించి రక్షించిన సిబ్బంది

బాపట్లటౌన్: సముద్రస్నానాలు చేస్తూ శనివారం ముగ్గురు మహిళలు, ఒక బాలుడు గల్లంతవగా, వారిని పోలీసులు, గజ ఈతగాళ్లు సురక్షితంగా ఒడ్డుకు తెచ్చారు. వివరాల్లోకి వెళితే బాపట్ల పట్టణం వివేకానంద కాలనీకి చెందిన కురగంటి మహేశ్వరి, తలతోటి లక్ష్మి, కట్టా రమణమ్మ, తాళ్లతోటి బ్రహ్మయ్యలు సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద అలలు రావడంతో గల్లంతయ్యారు. అవుట్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఎం.పోతురాజు ఈ విషయాన్ని గమనించి వెంటనే తీరంలోని గజ ఈతగాళ్ల సహాయంతో గల్లంతైన నలుగురిని కాపాడారు. వెంటనే స్పందించిన హెడ్‌కానిస్టేబుల్ ఎం.పోతురాజును జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.



సముద్రంలో గల్లంతైన వారిని కాపాడిన పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

అద్దంకి రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ బీ అర్జున్‌రావు సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జీవనోపాధులపై వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీడీ మాట్లాడుతూ వీఏఓలు గ్రామాల్లో పథకానికి అర్హులైన వారిని గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించాలన్నారు. మొండి బకాయిల వసూళ్లపై దృష్టిపెట్టాలని ఆయన సూచించారు. ఏపీఎంలు, వీఓఏలు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

డ్రగ్స్‌కు బానిసై సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


మృతుడు హరీష్

అద్దంకిరూరల్: విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ డ్రగ్స్‌కు బానిసైన అద్దంకికి చెందిన యువకుడు శనివారం సాయంత్రం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బాపట్ల జిల్లా అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై ప్రవీణ వివరాలు సేకరించారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... అద్దంకి పట్టణానికి చెందిన పోతేపల్లి చినరాము కుమారుడు హరీష్ (31) కొంత కాలం విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశాడు. అక్కడ డ్రగ్స్‌కు అలవాటు పడటంతో ఉద్యోగం మానివేసి అద్దంకి వచ్చాడు. డ్రగ్స్ వలన ఆరోగ్యం పాడవుతుందని భావించి తల్లిదండ్రులు చెన్నైలో వైద్యం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట అద్దంకి వచ్చాడు. శనివారం పట్టణంలోని నవ్య అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న తన పెద్దనాన్న ఇంటికి వెళ్లాడు. పెద్దనాన్న వాళ్లు విజయవాడ వెళ్లటంతో ఇంట్లో ఎవరూ లేకపోవటంతో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. స్థానికుల సమాచారంతో ఎస్సై ప్రవీణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పశువులకు బీమా చేయించాలి

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు


మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు

రేపల్లె: పశువులకు బీమా చేయించి, రైతులకు లబ్ధి చేకూర్చేలా.. పశు వైద్యసిబ్బంది కృషి చేయాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు సూచించారు. పశు బీమా పథకాలపై స్థానిక పశు వైద్యశాల కార్యాలయ ఆవరణంలో రేపల్లె, నిజాంపట్నం, భట్టిప్రోలు మండలాల పశువైద్యులు, సిబ్బందికి శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపల్లెలో 90, నిజాంపట్నంలో 17, భట్టిప్రోలు మండలంలో 13 పశువులకు మాత్రమే బీమా చేయించారన్నారు. ఈ నెల చివరకు తమ పశువులకు బీమా చేయించుకునేలా రైతులను చైతన్యపరచాలన్నారు. గొర్రెలు, మేకలు కలిగిన ప్రతి ఒక్క రైతు జీవాలకు ఉచితంగా నట్టల మందుని వేయించుకునేలా పనిచేయాలన్నారు. సమావేశంలో పశువైద్యులు కేదారేశ్వర్, జి.నరేంద్రబాబు, ప్రవీణ్ కుమార్, పి.మీనాక్షి దేవి, బి.లక్ష్మీరంజిత, రోషన్ బేగ్, శివకుమారి, హేమ ప్రియా, పారా సిబ్బంది, యానిమల్ హస్బెండ్రి అసిస్టెంట్స్, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

బాపట్లలో విజిలెన్స్ దాడులు

నలుగురిపై కేసులు నమోదు


హోటల్‌లో గ్యాస్ సిలెండర్లు సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

బాపట్లటౌన్: పట్టణంలోని పలు రేషన్ దుకాణాలలో విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు పట్టణంలోని షాప్ నెంబర్ 10, 30లో తనిఖీలు నిర్వహించారు. రేషన్ సరఫరా తేడాలు ఉండటంతో డీలర్లపై 6ఏ కింద కేసులు నమోదుచేశారు. పట్టణంలోని చీల్ రోడ్డులో చెన్నకేశవ, సాంబశివ టిఫిన్ సెంటర్లలో డొమెస్టిక్ సిలండర్లు వాడటాన్ని గమనించి దుకాణదారులపై 6-ఏ సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు. దాడులు నిర్వహించిన వారిలో విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రయ్య, విజిలెన్స్ ఏవో వాసంతి, సీఎస్‌డీటీ ఓంకార్ పాల్గొన్నారు.

30 విద్యుత్ మోటార్లలో వైర్లు చోరీ

మార్టూరు: రైతులు వ్యవసాయ భూముల్లో వినియోగించే సుమారు 30 విద్యుత్ మోటార్లకు చెందిన వైరు చోరీకి గురైనట్లు బొబ్బేపల్లి, రాజుగారిపాలెం రైతులు శనివారం విలేకరుల ముందు వాపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పక్కపక్కనే ఉండే రెండు గ్రామాల్లో 25కుపైగా రాజుగారిపాలెం గ్రామానికి చెందిన రైతుల మోటారు వైర్లు, బొబ్బేపల్లి గ్రామానికి చెందిన నాలుగు మోటార్ల వైర్లు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు శనివారం ఉదయం గుర్తించామని గ్రామ ఎంపీటీసీ సభ్యుడు కల్లేపల్లి శ్రీనివాసరాజు, సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజులు తెలిపారు.

ఒక్కో మోటారుకు సంబధించి 30 నుంచి 40 మీటర్ల వైరును చోరీ చేశారని, ఒక్కొక్క రైతుకు రూ.2 వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. గతంలో రెండుసార్లు వైరు చోరీ జరిగినప్పుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఎలాంటి ఫలి తం లేదన్నారు. మూడోసారి చోరీకి గురైందని, మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

నర్సరీల్లో రసీదులు తప్పనిసరి

జిల్లా ఉద్యానవన శాఖాధికారి జెన్నమ్మ


మాట్లాడుతున్న జిల్లా అధికారి జెన్నమ్మ

మార్టూరు: నర్సరీ యజమానులు తప్పనిసరిగా వినియోగదారులకు రసీదులు ఇవ్వాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి పీ జెన్నమ్మ పేర్కొన్నారు. శనివారం మార్టూరు, యద్దనపూడి మండలాల పరిధిలోని నర్సరీలను ఆమె పరిశీలించారు. జెన్నమ్మ నర్సరీ యజమానులతో మాట్లాడుతూ నర్సరీల నుంచి మొక్కలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదులు, బిల్లులు ఇవ్వాలన్నారు. మొక్కల పెంపకానికి నాణ్యమైన ఎరువులు వినియోగించాలని సూచించారు. నర్సరీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మార్టూరు, పర్చూరు ఉద్యాన శాఖాధికారులు బీ హనుమంతు నాయక్, రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

20న మినీ జాబ్ మేళా

బాపట్ల అర్బన్: ది సాల్వేషన్ ఆర్మీ ఐటీఐ కాలేజీలో ఈ నెల 20న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. జీతం విద్యార్హతను బట్టి ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ అర్హత కలిగిన, 18-28 సంవత్సరాల వయసు కలిగిన వారు తమ బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్, పాస్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9346280289, 9505229845 నంబర్లకు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

తూనికలు, కొలతలు సక్రమంగా ఉండాలి

జిల్లా లీగల్ మెట్రాలజీ లిల్లీ



బల్లికురవ: వినియోగదారులకు అమ్మే ప్రతి వస్తువు తూనికలు, కొలతలు సక్రమంగా ఉండాలని బాపట్ల జిల్లా లీగల్ మెట్రాలజీ లిల్లీ ఆదేశించారు. శనివారం బల్లికురవలోనిగ్రోమోర్‌తోపాటు పలు దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతోపాటు, కల్తీ లేకుండా ఉండాలన్నారు. ఏవస్తువు పైనైనా తయారు చేసిన తేదీ బ్యాచ్ నెంబర్, గడు వు తేదీ కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. తూనికలు కొలతల్లో మో సాలకు పాల్పడితే దుకాణాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రీ-ఆడిట్ విధానంపై అవగాహన అవసరం

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న ప్రీ-ఆడిట్ విధానంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఆడిట్ సంచాలకులు ఆర్.హరిప్రకాష్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో తెనాలి, పొన్నూరు, బాపట్ల, చీరాల, అద్దంకి మున్సిపల్ కమిషనర్లు, నగర పంచాయతీల్లోని సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రీ ఆడిట్ విధానంలోని ఉపయోగాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్‌శాఖ ఉపసంచాలకులు నాగశ్రీనివాసరావు, తాడేపల్లి, మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జామినర్ అశోక్ మోర్య, గుంటూరు, బాపట్ల జిల్లాల ఆడిట్ అధికారులు బి.ధనలక్ష్మి, కె.పద్మజ పాల్గొన్నారు.

జిల్లాలో ముగ్గురు ఎస్ఐలు బదిలీ

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఎస్ఐ జె.నాగరాజును వేమూరు పోలీస్‌స్టేషన్‌కు, చీరాల 2టౌన్ నుంచి తాజాగా వీఆర్‌కు వచ్చిన పి.సురేష్‌ను అమర్తలూరు పోలీస్ స్టేషన్‌కు, అమర్తలూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న టి.అనిల్‌కుమార్‌ను జిల్లా వీఆర్‌కు బదిలీ చేస్తూ జిల్లా పోలీస్ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది.